సాక్షి
చెన్నై | ఆదివారం |
జనవరి | 20 | 2019

# కాక్లియర్ ఇంప్లాంట్ సౌకర్యాల విస్తరణ



కాక్లియర్ ఇంప్లాంట్ చిన్నారులతో డాక్టర్ జి.సెల్వరాజన్, డాక్టర్ రవికుమార్



చిన్నారుల బాంగ్రా నృత్య ప్రదర్శన

- అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ జి.సెల్వరాజన్
- శ్రీరామచంద్రలో 'క్లిప్స్' 13వ వార్షిక వేడుకలు

టీ.నగర్: త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, తాలూకా స్థాయి ఆస్పత్రుల్లో కాక్లియర్ ఇంప్లాంట్ సౌకర్యాలను ప్రారంభించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వైద్య విద్య, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ జి.సెల్వరాజ్ అన్నారు. చెన్నై పోరూరులోగల శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో క్లిప్స్ 13వ వార్షికోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి డాక్టర్ సెల్వరాజన్ హాజరయ్యారు. హెడ్ అండ్ నెక్ సర్జరీ, ఈఎన్‌టీ ప్రొఫెసర్, డాక్టర్ ఏ.రవికుమార్, రూపా నాగరాజన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీరామచంద్ర ఆస్పత్రిలో కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు చేయించుకున్న చిన్నారులు పలువురు హాజరయ్యారు. ఇందులో డాక్టర్ జి. సెల్వరాజన్ మాట్లాడుతూ రామచంద్ర ఆస్పత్రిలో 13 ఏళ్లలో 250 మందికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు నిర్వహించడం హర్షణీయమని అన్నారు. తమిళనాడు ఆరోగ్య బీమా ద్వారా మూడు వేల సర్జరీలు ఇంతవరకు జరిగినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 17 ప్రభుత్వ వైద్య ఆస్పత్రుల్లో ఈ సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. ఈ సర్జరీ పూర్తి చేసుకున్న చిన్నారులకు ఆడియో, స్పీచ్, లాంగ్వేజ్ థెరపీ అందజేసేందుకు పోస్టు గ్రాడ్యుయేట్ ఎంఎఎస్ఎల్‌పీ ప్రోగ్రామ్ త్వరలో ప్రారంభిస్తామన్నారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా దీనిపై పరిశోధనలు జరుగుతున్నాయని, త్వరలో ప్రత్యేక పరికరాలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాక్లియర్ ఇంప్లాంట్ చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలతో ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమాన్ని ఈఎన్‌టీ విభాగం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పీచ్, లాంగ్వేజ్ అండ్ హియరింగ్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించింది.